క్లుప్తంగా

9 నుంచి మహాసుదర్శన యాగం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో నారసింహ సహిత మహాసుదర్శన యాగాన్ని అష్టలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం నుంచి మూడు రోజులు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే యాగ ప్రక్రియ చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతోందన్నారు. యాగంలో పాల్గొన దలసిన వారు ముందుగా కమిటీ సభ్యులకు తెలియజేయాలన్నారు. రోజూ సాయంత్రం శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణ, సుదర్శన స్తోత్రములు, పారాయణలు సామూహికంగా జరుగుతాయని పేర్కొన్నారు.

పరిశుభ్రం..



వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్‌లను సర్పంచ్ పెయ్యిల నాగమణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గురువారం వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించిన నీటిని విడుదల చేయిస్తున్నామని సర్పంచ్ నాగమణి తెలిపారు. నీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. మురపాక, పీబీనగర్ కాలనీ, కొత్తపేట తదితర గ్రామాల్లోని ట్యాంక్‌లను శుభ్రం చేశారు.

సర్పంచ్‌లకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రమాదేవి గురువారం ప్రారంభించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. ఇంటి నిర్మాణ అనుమతులు, ప్రభుత్వ భూముల రక్షణ, పాఠశాలలు, అంగన్‌వాడీలు నిర్వహణ, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు సమష్టిగా గ్రామ పంచాయతీ చట్టాల నిబంధనలు మేరకు పని చేయాలన్నారు. పరిపాలన అధికారి రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రణస్థలం మండలంలో..

రణస్థలం: గ్రామ పంచాయతీ పరిపాలనను కార్యదర్శులు, సర్పంచ్‌లు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో 31 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, 28 మంది కార్యదర్శులకు గ్రామ పంచాయతీ పరిపాలనపై శిక్షణ ఇచ్చారు. ఏఓ ధనుంజయరావు, ఈఓపీఆర్డీ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

గార: పంచాయతీల అభివృద్ధిల కోసం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్‌పై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. పంచాయతీ వార్షిక ప్రణాళికపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పలు సందేహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.కల్యాణి ఉన్నారు.

ఆస్పత్రికి ఫ్యాన్లు వితరణ



ఫ్యాన్లను అందజేస్తున్న ఎలియన్స్ క్లబ్ మిత్ర ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఏలియన్స్ క్లబ్ మిత్ర ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 15 సీలింగ్ ఫ్యాన్‌లను క్లబ్ సభ్యులు గురువారం వితరణ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులు దోమలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి రావడంతో క్లబ్ మిత్ర సభ్యులు, స్నేహితుల ఆర్థిక సహకారంతో రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, అకౌంటెంట్ శ్రీనివాస్‌లకు ఫ్యాన్లను అందజేసినట్టు క్లబ్ మిత్ర ప్రెసిడెంట్ పొట్నూరు సూర్య ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ మిత్ర అధ్యక్షులు పొట్నూరు సూర్య ప్రకాశరావు, సెక్రటరీ పీవీ కృష్ణారావు, శాసనపురి త్రినాథరావు, ఊణ మన్మథరావు, ఇప్పిలి శ్రీనివాసరావు, కింతలి దాలిశెట్టి, జామి శ్రీనివాసరావు, వి.వి.రామరాజు, ఎ.నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం ఉన్నారు.

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

- ట్రాఫిక్ మళ్లింపుపై ఆంక్షలు విధించిన ఎస్పీ
- ఈ నెల 12 నుంచి అమల్లోకి

శ్రీకాకుళం క్రైమ్:

రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల తాకిడితో నగరంలోని రహదారులు, వ్యాపార సముదాయాలు కిక్కిరిసిపోతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తమ వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్ ప్రదేశం లేక అవస్థలు పడుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చే ప్రజలు ట్రాఫిక్‌లో పడుతున్న కష్టాల గురించి జూలై 26వ తేదీన 'సాక్షి' దిన పత్రికలో 'ఇచ్చట కాకుంటే ఎచ్చట' కథనాన్ని ప్రచురించింది. దీనికి జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పందించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయడమే మార్గానికి సుగమంగా భావించారు. బుధవారం నగరంలో రద్దీగా ఉన్న కూడళ్లను, వ్యాపార సముదాయాలను అధికారులతో కలియ తిరిగి ప్రజలతో మమేకమై ఎలా చేయాలన్నదానిపై ఓ నిర్ణయానికొచ్చారు. గురువారం దీనిపై ట్రాఫిక్ అధికారులతో సమీక్షించి ట్రాఫిక్ మళ్లింపుపై ఆంక్షలు విధించాలని భావించారు. దీన్ని ఈ నెల 12వ తేదీ నుంచి ప్రజలు పాటించేలా ట్రాఫిక్ పోలీసులు అమలు చేసేలా ఉత్తర్వులిచ్చారు.



బుధవారం ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సాక్షి ఎఫెక్ట్



ఇచ్చట కాకుంటే ఎచ్చట..?

జూలై 26న సాక్షిలో పార్కింగ్ సమస్యపై ప్రచురితమైన కథనం క్లిప్పింగ్

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

ఆమదాలవలస–ఆదివారంపేట మీదుగా నగరంలోకి వచ్చే ఆటోలు బలగ రిమ్స్ ఆస్పత్రి కూడలి వద్ద కుడి వైపునకు మలుపు తిరిగి రిమ్స్ ఆస్పత్రి–శాంతినగర్ కాలనీ–ఆర్ట్స్ కళాశాల మీదుగా అంబేడ్కర్ కూడలి వద్దకు చేరాలి. ఇలా చేయడం ద్వారా ఆటోలను ఆర్టీసీ కాంప్లెక్స్ వైపునకు నియంత్రించడంతో నిత్యం రద్దీగా ఉండే జడ్జి బంగ్లా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ట్రాఫిక్ తగ్గి ప్రమాదాలు కూడా నియంత్రించినట్లవుతుంది.

- శ్రీకాకుళం నుంచి విజయవాడ, హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులు బలగ–ఆదివారంపేట మీదుగా కొత్తరోడ్డు వద్దకు చేరుకుని విశాఖపట్నం వైపు వెళ్లాలి. పాతపట్నం నుంచి విజయవాడ వెళ్లే ప్రైవేటు బస్సులకూ ఇదే వర్తిస్తుంది. ఆర్టీసీ కాంప్లెక్స్, డేఅండ్‌నైట్, సింధూర ఆస్పత్రి జంక్షన్ వైపు ఎట్టి పరిస్థితుల్లో రాకూడదు.
- సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల మధ్య ఆర్టీసీ కాంప్లెక్స్ వైపునకు ట్రావెల్ బస్సులు వెళ్లడం, అదే సమయంలో స్కూళ్లు, కళాశాలలు, కార్యాలయాల నుంచి రాకపోకలు చేసే ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇక ఆ బాధ తప్పినట్లే.. ట్రావెల్ బస్సులు అటునుంచి వచ్చే సమయాలు (ఉదయం) రకరకాలుగా ఉండటంతో ఇబ్బంది లేదని పోలీసులు భావిస్తున్నారు.
- విశాఖ నుంచి శ్రీకాకుళం నగరంలోకి ప్రవేశించే సింహద్వారం–కిమ్స్ ఆస్పత్రి మీదుగా నగరంలోకి వచ్చే వాహనాలు ఆర్ట్స్ కళాశాలకు వెళ్లాలనుకుంటే సింధూర జంక్షన్ వద్ద ఎడమవైపునకు తిరిగి సింధూర ఆస్పత్రి, ఏ–1 హోటల్ కూడలి మీదుగా చేరాలి. ఏ–1 హోటల్ జంక్షన్ నుంచి సింధూర ఆస్పత్రి జంక్షన్ వైపునకు ఏ వాహనాలు అనుమతించరు.
- ఏ–1 హోటల్ జంక్షన్ మీదుగా డేఅండ్‌నైట్, కొత్త బ్రిడ్జి వైపునకు గల సింధూర ఆస్పత్రి రోడ్డును 'వన్‌వే రోడ్డు'గా నిర్ధారించారు.
- పట్టణ ప్రజలు పోలీసులకు సహకరించి ఆంక్షలు పాటించాలని, లేనిచో మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ (ఇన్‌చార్జి అధికారి) వి.సందీప్ స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం పరిధిలోని హడ్కో కాల నీ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం తెలిపారు. హడ్కో కాలనీ, రిమ్స్ రోడ్డు, బలగ, కుమ్మరి వీధి, బావాజీతోట ప్రాంతమంతా సరఫరాను నిలిపి వేయనున్నట్టు పేర్కొన్నారు.

అలాగే ఎచ్చెర్ల మండలం 11 కేవీ ఇండస్ట్రియల్, కొత్తపేట ఫీడర్ల పరిధిలో కూడా మర మ్మతులు చేపడుతున్నట్టు చెప్పారు.

దీంతో తమ్మినాయుడుపేట, సనపలవానిపేట, ఇబ్రహీంబాద్, పూడివలస, కొత్తపేట, యంకన్నగారిపేట, తెప్పరేవు, దోమాం, పెయ్యిలవానిపేట, దుప్పలవలస, ఫరీద్‌పేట, నవభారత్‌నగర్ జంక్షన్, ఇండస్ట్రియల్ ఏరియా, వరం కాలనీ, రాజరాజేశ్వరి ఆలయ ప్రాంతంతో పాటు టీచర్స్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంట ల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ బయ్యన్నాయుడు గురువారం ప్రకటనలో తెలియజేశారు. ఎస్ఎస్ఆర్‌పురం, జరజాం, చిన్నరావుపల్లి, తంగివానిపేట, బట్నవానిపేట తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో కోత ఉంటుందన్నారు.

రంగోత్సవ్ పోటీలకు విద్యార్థులకు శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: జాతీయస్థాయిలో ముంబాయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ వారిచే ఆన్‌లైన్‌లో నిర్వహించే పది రకాల పోటీలకు శ్రీకాకుళం నగరంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ నుంచి సుమారు 140 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు గురువారం తెలిపారు. వీరికి ఇద్దరు టీచర్లతో శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు అన్ని విభాగాల్లో పాల్గొనేలా తర్ఫీదు ఇస్తున్నామన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, ఇంగ్లిష్ రాత, కార్టూన్ వంటి పోటీలలో వీరంతా పాల్గొంటారన్నారు. వారికి ఇక్కడే పోటీలు నిర్వహించి, వారు ఆన్‌లైన్‌లో ఇచ్చే పేపర్‌పై బొమ్మలు వేయించి పంపుతున్నామన్నారు. ఎంట్రీలన్నీ అక్టోబర్ 20వ తేదీలోగా చేరాల్సి ఉంటుందన్నారు.



శిక్షణలో చిన్నారులు

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

రణస్థలం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని సాధించాలంటే యాంత్రీకరణ, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తిరుపతిపాలెం గ్రామంలో వ్యవసాయ పద్ధతులు–పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తక్కువ పురుగు మందుల వాడకం, ఎరువుల వినియోగం తగ్గించడం వంటి పద్ధతులను అవలబించాలని రైతులకు సూచించారు. అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జి సుహాసిని మాట్లాడుతూ విత్తనశుద్ధి, మొలక కట్టడం వంటి వివరాలను తెలియజేశారు. తిరుపతిపాలెం సర్పంచ్ రవి, గ్రామ పెద్ద రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఈయూ కార్యాలయం ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం–2 డిపో కార్యాలయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్సుల్లో త్వరలో మహిళలందరికీ ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతుందని శంకర్ తెలిపారు. శ్రీకాకుళం నుంచి విజయవాడకు బస్సులను పెంచుకున్నామని, త్వరలో శ్రీకాకుళం నుంచి తిరుపతికి కూడా బస్సును నడపాలని శ్రీకాకుళం డీపీటీవో ఎ.విజయకుమార్‌కు సూచించారు. ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు పెట్టుకున్న ఆశలు నెరవేరతాయన్న నమ్మకం ఉందన్నారు. డీపీటీవో ఎ.విజయ్‌కుమార్, శ్రీకాకుళం1, 2, పలాస, టెక్కలి డిపోల మేనేజర్లు పి.కె.ఎం.రాజు, కె.ఎస్.ఆర్.శర్మ, ఆర్.ఎస్.నాయుడు, ఎం.శ్రీనివాసరావు, ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నానాజీ, రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్.అప్పారావు, ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.దశరథుడు, గూనాపు త్రినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

విశ్రాంతి భవనం, క్యాంటీన్ల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది విశ్రాంతి భవనం, సబ్సిడీ క్యాంటీన్లను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం సందర్శించారు. విశ్రాంతి భవన నిర్వహణ, మౌలిక వసతులపై ఎస్పీ ఆరా తీసి విధి నిర్వహణలో హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చే సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు అనుకూలంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే క్యాంటీన్లో వస్తు సామగ్రి, కిరాణా సరుకులను పరిశీలించి జిల్లాలో అందరికీ సరిపడా వస్తు సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సిబ్బందికి నెల మొదటి వారంలో సరకులు అందేలా చూడాలని ఎస్పీ సూచించారు.



క్యాంటీన్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

బెహర మనోవికాస కేంద్రం సందర్శన

శ్రీకాకుళం కల్చరల్: హౌసింగ్‌బోర్డు కాలనీలోని బెహరా మనోవికాస కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు గురువారం సందర్శించారు. విభిన్న ప్రతిభావంతుల వద్ద సేవని అందించే వారికి న్యాయ పరమైన సలహాలు, సూచనలు అందచేశారు. విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. అడ్వకేట్ ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.



బెహరా మనోవికాస కేంద్రంలో సన్యాసినాయుడు

మారని తీరు!



డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో నడిరోడ్డుపై వెళ్తున్న గేదెలు

- రోడ్లపైనే గేదెలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో నడిరోడ్లపై, ప్రధాన కూడళ్లలో రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా పశువులు సంచరిస్తున్నాయి. జిల్లా పరిషత్ రోడ్డులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అటువైపుగా వెళ్తూ రోడ్డుపై విచ్చలవిడిగా పశువులు సంచరించేందుకు వీల్లేదని ఇటీవల స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాలు సైతం నగరంలో అమలు కావడం లేదు. ఎక్కడ చూసినా రోడ్లపైనే పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఇటీవల పశువుల యజమానులతో నగర పాలకసంస్థ కమిషనర్ ఓబులేశు సమావేశం సైతం నిర్వహించారు. పశువులను విచ్చలవిడిగా రోడ్లపై వదిలేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పశులను స్వాధీనం చేసుకొని సీతంపేట అడవుల్లో వదిలేస్తామని హెచ్చరించారు. అయినా పశువుల యజమానుల్లో చలనం లేకుండా పోయింది. పశువుల్ని మేతకు తీసుకెళ్లేటప్పుడు తప్పనిసరిగా వెనుక ఉండి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత యజమానులపై ఉందని సూచించారు. అయితే వీటిని ఎవరూ పట్టించుకోవడం లేదు.



రాత్రి వేళ సంచరిస్తున్న ఆవులు

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

జి.సిగడాం: మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 63 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించామని, 58 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నట్లు చెప్పారు. వీఆర్ పేటలో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ ఎన్నిక జరగలేదన్నారు. నిద్దాం, అద్వానంపేట, మెట్టవలస, సీతంపేట పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలను వాయిదా వేసినట్లు వెల్లడించారు.

మూడు చోట్ల వాయిదా...

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో మొత్తం పాఠశాలలు 106 ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 92 ఏకగ్రీవ మయ్యాయి. 11 చోట్ల ఎన్నికలు జరిగాయి. మూడు చోట్ల బొంతలకోడూరు, ఇబ్రహింబాద్, చిలకపాలేంల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. ఈ పాఠశాలల్లో ఎన్నికలకు మళ్లీ షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు ఎంఈఓ కె.పున్నయ్య తెలిపారు. ఈ ఎన్నికల్లో కూటమి నాయకులకు అధికారులు మద్దతుగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. ఎస్ఎంపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సంధ్యా గజపతి వర్గం పోటీకి ప్రయత్నించగా.. అక్కడ చౌదిరి బాబ్జీ ఆధ్వర్యంలోని టీడీపీ నాయకులు అడ్డుకొని ఏకగ్రీవం చేసుకున్నారు. బొంతలకోడూరులో అధికార పార్టీ నాయకులకు ప్రతికూల పరిస్థితులు ఉండటంతో కోరం సమస్య సృష్టించారు. దీంతో ఎన్నికలు రద్దయ్యాయి.

శ్రీకాకుళం రూరల్: మండలంలో 79 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 40 ప్రైమరీ, 16 యూపీ, 13 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 44 పాఠశాలల్లో కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. మిగిలిన చోట ఎన్నిక జరిగినట్టు ఎంఈవో కృష్ణారావు తెలిపారు.

వరం స్కూల్ చైర్మన్‌గా సంధ్యా

శ్రీకాకుళం: గుజరాతీపేంలోని అందవరపు వరహా నర్సింహం మున్సిపల్ హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఊటపల్లి సంధ్యా, వైస్ చైర్మన్‌గా నక్కరాజు ఎన్నికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు పి.ఇందిరా తెలిపారు.

గార: గార మండలంలో 72 ప్రాథమిక పాఠశాలలు, 15 యూపీ, తొమ్మిది హైస్కూళ్లు ఉన్నాయి. వీటితో పాటు కస్తూర్బాగాంధీ విద్యాలయం, వమరవల్లి రెసిడెన్షియల్ పాఠశాలతో కలిపి 98 ఉండగా, 87 స్కూళ్లలో ఏకగ్రీవంగా కార్యవర్గాలను ఎన్నుకున్నారు. సతివాడ, లింగాలవలస, బోరవానిపేట, గార, శ్రీకూర్మం బాలురు, శ్రీకూర్మం బాలికలు, తండ్యాలపేట, కంద్రవీధి, పడపానిపేట పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్ష, కమిటీ సభ్యులు ఎన్నుకున్నారని ఎంఈవో రామకృష్ణారావు తెలిపారు. దువ్వపేట ప్రైమరీ పాఠశాలలో 30 మంది విద్యార్థుల పేరెంట్స్ ఎన్నికకు హాజరైనప్పటికీ మరో పది విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికకు వెళ్లకుండా ఉండిపోయారు. రాజకీయ నాయకుల జోక్యం చేసుకోవడంతో కోరమ్ లేదని వాయిదా వేయాలని సూచించడంతో హెచ్ఎం ఎన్నికను వాయిదా వేశారని గ్రామస్తులు తెలిపారు. అలాగే తూలుగు పంచాయతీ ఉప్పరవానిపేట ప్రైమరీ స్కూల్‌లో ఎన్నిక తర్వాత వివాదం జరిగింది.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం..

రణస్థలం: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కావాలనే దృక్పథంతో ప్రభుత్వ జరిపించిన తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపించారు. పాఠశాలల అభివృద్ధి దృష్ట్యా అధికారంలో ఉన్న కుటమి ప్రభుత్వ మద్దతుదారులకే తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక వదిలేద్దామని సదుద్దేశంతో చాలా చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పోటీలో నిలబడలేదు. గొల్లపేట, పల్లిపేట, ఎన్‌జీఆర్.పురం, మరువాడ, ఎర్రవరం, మహంతిపాలెం. కొండములగాం, ముక్తంపురం వంటి పాఠశాలల్లో తల్లిదండ్రుల కోరిక మేరకు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను నిలబెట్టి గెలిపించుకున్నారు. దీంతో ఆయా చోట్ల కుటమి నాయకులు సరైన సంఖ్యా బలం లేకపోయినా పోటీకి దిగి ఉపాధ్యాయులను బెదిరించేలా మండల, నియోజకవర్గ నాయకులతో చర్యలకు ఉపక్రమించారు. కొన్నిచోట్ల తల్లిదండ్రులు మాత్రం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే గెలిపించారు. మండలంలోని 108 పాఠశాలల్లో 83 చోట్ల ఏకగ్రీవయ్యాయి. 20 చోట్ల ఎన్నికలు జరిగాయి. వివిధ కారణాలు, కోరం లేక, వివాదాస్పదమై ఐదు చోట్ల ఎన్నికలు వాయిదా వేశారు.



జి.సిగడాం: వాండ్రంగిలో ప్రమాణ స్వీకరణ చేస్తున్న ఎంఎస్‌సీ సభ్యులు



శ్రీకాకుళం రూరల్: ఎస్ఎస్ వలస పాఠశాలలో..



శ్రీకాకుళం రూరల్: పాత్రునివలస పాఠశాలలో ఎన్నిక ప్రక్రియను నిర్వహిస్తున్న దృశ్యం



రణస్థలం: గొల్లపేటలో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



శ్రీకాకుళం: ఊటపల్లి సంధ్య (చైర్మన్)



శ్రీకాకుళం: నక్క రాజు (వైస్ చైర్మన్)



శ్రీకాకుళం రూరల్: సింగుపురం పాఠశాలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం



గార: చల్లపేటలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు



గార: కె.మత్స్యలేశంలో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

పీఎస్ఎన్ఎం హెచ్‌స్కూల్‌లో..



ఎస్ఎంసీ కార్యవర్గంతో ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని పీఎస్ఎన్ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు ప్రధానోపాధ్యాయులు బలివాడ భాస్కరరావు తెలిపారు. చైర్‌పర్సన్‌గా పల్లా జయలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా అక్కినపల్లి ప్రియాంకలతోపాటు మరో 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులు సదాశివుని శంకరరావు, ఎ.చిన్నవాడు, పీవీ రమణ, పి.రమణకుమారి, టి.శ్రీపూర్ణిమ, పైడి భాగ్యలక్ష్మి, కె.చంద్రకళ, ఇ.గౌరి, సీహెచ్ విజయశ్రీ ఉన్నారు.